సాక్షి
విశాఖపట్నం
గురువారం । 8 । ఆగస్టు । 2024

కుట్ర పన్ని.. కాసులు కుమ్మరించి..!

అనుకున్నదే జరిగింది. అధికార పార్టీ అరాచకం ముందు.. నీతివంతమైన రాజకీయాలు మరోసారి ఓటమి పాలయ్యాయి. ఓవైపు ప్రలోభాలతో.. మరోవైపు బెదిరింపు రాజకీయాలతో కార్పొరేటర్లను భయపెట్టి.. డబ్బులకు లొంగదీసుకొని.. ఓట్లు వేసుకున్నారు. డబ్బులు తీసుకున్న వారు ఓట్లు వేస్తారా లేదా అనే భయంతో అడ్డగోలుగా 'పెన్సిల్' మార్కు రాజకీయాలకూ తెరతీశారు. అక్రమ రాజకీయాలతో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీని టీడీపీ అండ్ కో కైవసం చేసుకుంది. ఎన్నికల అధికారిగా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన జీవీఎంసీ కమిషనర్.. అధికార పార్టీకి దాసోహమన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు చెప్పినట్లుగానే వారికి కొమ్ము కాస్తూ చెల్లని ఓట్లను కూడా లెక్కింపులో భాగం చేసేస్తూ.. టీడీపీ కార్పొరేటర్లు విజయం సాధించేశారంటూ ప్రకటించేశారు. కమిషనర్ వ్యవహారం, టీడీపీ నేతల తప్పుడు రాజకీయంపై ప్రతిఘటించిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు.


కార్పొరేటర్ పద్మారెడ్డిపై పోలీసు ప్రతాపం

- జీవీఎంసీ స్టాండింగ్ కమిటీని కైవసం చేసుకున్న కూటమి
- 10 స్థానాల్లోనూ విజయం
- పక్కా.. పెన్సిల్ 'మార్కు' రాజకీయం..!
- అధికార పార్టీకి కొమ్ముకాసిన కమిషనర్
- ఇన్‌వ్యాలిడ్ ఓట్లనూ పరిగణనలోకి తీసుకోవడంపై రచ్చ
- అధికారమదంతో అడ్డగోలుగా వ్యవహరించిన టీడీపీ నేతలు
- ఉదయం నుంచి పోలింగ్ కేంద్రం వద్దే తిష్టవేసిన కూటమి ఎమ్మెల్యేలు
- చివరి నిమిషం వరకూ ప్రలోభాలతో ఎర
- అక్రమ విజయాన్ని రద్దు చెయ్యాలంటూ వైఎస్సార్‌సీపీ ఆందోళన
- ఖాకీల బందోబస్తుతో అణిచివేసిన టీడీపీ నేతలు
- న్యాయపోరాటం చేస్తామని ప్రకటించిన మేయర్


జీవీఎంసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు


కార్పొరేటర్లను బలవంతంగా లాక్కెళ్తున్న పోలీసులు


వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో పోలీసుల వాగ్వాదం

సాక్షి, విశాఖపట్నం :

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు గందరగోళంగా మారాయి. ఉదయం 10.30 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా సాయంత్రం లెక్కింపు సమయంలో తెలుగుదేశం పార్టీ నేతల బండారం బట్టబయలైంది. మొత్తం 97 మంది కార్పొరేటర్లుండగా.. సీపీఎం ఓటింగ్‌కు దూరంగా ఉంది. మిగిలిన 96 మంది కార్పొరేటర్లు మధ్యాహ్నం 2 గంటల వరకూ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. టీడీపీ అభ్యర్థులు విల్లూరి భాస్కరరావు, గొలగాని వీరారావు , పిసిని వరాహ లక్ష్మీనరసింహ , గల్లా పోలిపల్లి , బొమ్మిడి రమణ , బల్ల శ్రీనివాసరావు , శరగడం రాజశేఖర్ , నొల్లి నూకరత్నం , లక్ష్మీబాయి పులి , పిల్ల మంగమ్మ ఓట్లతో విజయం సాధించారు. అనంతరం స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారికి కమిషనర్ ధ్రువ పత్రాలు అందించారు.

'పెన్సిల్' మార్కు రాజకీయాలు

ఎవరికైతే రూ.5 లక్షలు చొప్పున డబ్బులు పంపిణీ చేశారో వారు ఓట్లు వేస్తారా వెయ్యరా అని తెలుసుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు కుయుక్తులు పన్నారు. విధుల్లో ఉన్న కొందరు జీవీఎంసీ అధికారులతో ముందుగానే మాట్లాడుకున్నారు. ఇటీవల పార్టీలోకి చేరిన 14 మందికి 14 రకాల కలర్ పెన్సిల్స్‌ని తలొకటి ఇచ్చారు. 'మీ బ్యాలెట్‌పై మీకిచ్చిన పెన్సిల్‌తో గీత పెట్టాలని, లేదంటే అధికారంలో ఉన్న తాము మీ సంగతి చూస్తామంటూ' ఎమ్మెల్యేలు హెచ్చరించారు.

ఆ 'గీతల' ఓట్లు చెల్లనివే..

టీడీపీ నేతలు చేసిన పెన్సిల్ గీతలున్న ఓట్లు చెల్లనివిగా పరిగణించాలంటూ కమిషనర్‌ను వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేసినా పట్టించుకోకపోవడంతో పోర్టికోలో ధర్నాకు దిగారు. 14 ఓట్లను ఇన్‌వ్యాలిడ్‌గా ప్రకటించాలంటూ నినాదాలు చేసిన కార్పొరేటర్లపై టీడీపీ నేతలు.. పోలీసు బలగాలతో నిలువరించారు. న్యాయం కోసం పోరాడుతున్న కార్పొరేటర్లను బయటికి పంపించెయ్యాలంటూ టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు ఆదేశిస్తుంటే పోలీసులు వారు చెప్పినట్లు చేస్తూ జులుం ప్రదర్శించారు. మహిళా కార్పొరేటర్లపైనా పోలీసులు ప్రతాపం చూపించారు.

దీంతో ఆయా కార్పొరేటర్లు తమకిచ్చిన పెన్సిల్‌తో బ్యాలెట్ పత్రాలపై గీతలు గీశారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈ గీతలను గమనించిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. చివర్లో చూద్దామంటూ కమిషనర్ దాటవేశారు. చివరికి వాటిని వ్యాలిడ్‌గా పరిగణించడంతో గొడవ మొదలైంది.

'ఫోన్' కాల్‌తో మాట మార్చిన కమిషనర్

ఎన్నికల లెక్కింపు సమయంలో కమిషనర్ పూర్తిగా 'పచ్చ'పాతంతో వ్యవహరించారు. మొదటి రౌండ్‌లో 5 ఓట్లపై పెన్సిల్ గీతలు గమనించిన కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, తర్వాత రౌండ్‌లో 14కు పైగా చెల్లని ఓట్లు ఉన్నట్లు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి కమిషనర్ సంపత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. అవి పక్కన ఉంచుదాం.. చివర్లో చూద్దామంటూ నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో వెంటనే ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీను దృష్టికి తీసుకెళ్లారు. వీటన్నింటినీ తొలుత కమిషనర్ పక్కనపెట్టారు. లెక్కింపు చివరి దశకు వచ్చిన సమయంలో కమిషనర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. తరువాత ఇన్‌వ్యాలిడ్ ఓట్లన్నీ వ్యాలిడ్ ఓట్లుగా పరిగణిస్తున్నామని చెప్పడంతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పట్టారు. అయినా కమిషనర్ బేఖాతరు చేస్తూ టీడీపీ కార్పొరేటర్లు 10 మంది విజయం సాధించినట్లు ప్రకటించారు. కూటమి నేతలు, జీవీఎంసీ అధికారులు వ్యవహరించిన తీరుపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అక్కరమాని రోహిణి కన్నీటి పర్యంతమయ్యారు. అయితే మున్సిపల్ ఎన్నికల నిబంధనల మేరకే అన్ని ఓట్లను వ్యాలీడ్‌గా పరిగణనలోకి తీసుకున్నామని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ స్పష్టం చేశారు. – మిగతా 8వ పేజీలో

రేషన్ సరకుల అక్రమ నిల్వలపై సమాచారం ఇవ్వండి

కంట్రోల్ రూమ్: 0891-2590100, 2590102

మహారాణిపేట: ప్రజా పంపిణీ వ్యవస్థ కింద విడుదల చేసిన సరకుల అక్రమ నిల్వ, రవాణాపై సమాచారం ఉంటే కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని జేసీ కె.మయూర్ అశోక్ ప్రజలను కోరారు. 0891-2590100, 0891-2590102లో సిబ్బంది అందుబాటులో ఉంటారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీడీఎస్ సరకులు అక్రమ నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో పీడీఎస్ బియ్యం, ఇతర సరకులు పక్కదారి పట్టకుండా తనిఖీ చేసేందుకు 12 బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

'వందేభారత్' నడిచే రోజుల్లో స్వల్ప మార్పులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం(20833/ 20834) వందేభారత్ నడిచే రోజుల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు రైల్వే బోర్డు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పులు ఎప్పటినుంచి అమల్లోకి రానున్నాయో తెలియదని, త్వరలోనే ఈ మార్పులు జరుగుతాయని తెలిపారు. విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం (20833/20834) మధ్య ప్రస్తుతం ఆదివారం మినహా ప్రతి రోజు(6 రోజులు) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు సాగిస్తుంది. త్వరలో మంగళవారం మినహా ప్రతి రోజు (6 రోజులు) నడిచేలా మార్పులు చేయనున్నట్లు తెలిసింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ

తగరపువలస: సంక్రాంతి తరువాత కూటమి నిజస్వరూపాన్ని ప్రజలు తెలుసుకుంటారని, రెండేళ్లలో తేలిపోయి.. రానున్న అయిదేళ్లలో అధికారం కోల్పోవడం ఖాయమని విశాఖ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం ఆనందపురం మండలం బోయపాలెంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్‌హాలులో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక కూటమి ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెబుతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. మన గౌరవ మర్యాదలు నిలబెట్టుకోవడానికి వైఎస్సార్‌సీపీకి ఈ గెలుపు కీలకమన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేద్దామని పిలుపునిచ్చారు. మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బొత్స సత్యనారాయణ వంటి అనుభవం ఉన్న నాయకుడు కౌన్సిల్‌కు అవసరమన్నారు. ప్రశ్నించే నాయకుడిగా ఆయనను మనమంతా పెద్దల సభకు పంపిద్దామన్నారు. భీమిలిలో సంపూర్ణ మెజార్టీ వైఎస్సార్‌సీపీకి ఉందన్నారు. ఎవరూ ప్రలోభాలు లొంగవద్దన్నారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ కూటమి పాలనలో బీహార్ మాదిరిగా హత్యలు, బెదిరింపులతో రాష్ట్రం అట్టుడుకుతోందన్నారు. నాలుగింట మూడింతలు వైఎస్సార్‌సీకీ బలం ఉన్నందున నైతికంగా ఇప్పటికే గెలుపు ఖాయమన్నారు. అనైతికతకు మారుపేరైన చంద్రబాబు మైండ్‌గేమ్‌కు తెరతీశారన్నారు. అనకాపల్లి నుంచి అనంతపురం వరకు గౌరవంలోను, హుందాతనంలోనూ చంద్రబాబు కంటే బొత్స ముందు వరుసలో ఉంటారన్నారు. సంపద సృష్టిస్తానని నాలుక మడతపెట్టిన చంద్రబాబుకు తన 100 రోజుల పాలనలోనే ఎమ్మెల్సీ ఎన్నికలతో వైఎస్సార్‌సీపీ సత్తా తెలియాలన్నారు. బొత్స గెలుపు పార్టీకి, రాష్ట్రానికి అవసరమన్నారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం వైఎస్సార్‌సీపీలో ఉన్నవారే అసలు సిసలైన ప్రజాప్రతినిధులన్నారు. ఇంట్లో మనిషి వంటి బొత్సను గెలిపించుకుని ఉత్తరాంధ్ర గౌరవాన్ని నిలబెట్టుకుందామన్నారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ సత్తిబాబును గెలిపిస్తే ఉత్తరాంధ్రలో ప్రతి ఒక్కరు గెలిచినట్టేనన్నారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ బొత్స సత్యనారాయణకు ఎమ్మెల్సీ అన్నది చిన్న పదవి అయినా ఆయన పార్టీలకు అతీతంగా అందరికీ కావలసిన నాయకుడన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయగలిగిన ఆయన గెలుపు మనకు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, కార్పొరేటర్లు ముత్తంశెట్టి ప్రియాంక, దొలపల్లి ఏడుకొండలు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, మండలపార్టీ అధ్యక్షుడు బంక సత్యం, గాడు శ్రీను, కోరాడ లక్ష్మణ, ఎంపీపీ కె.రాంబాబు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, దాట్ల పెదబాబు, ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


భీమిలి నాయకులతో బొత్స సత్యనారాయణ, ముత్తంశెట్టి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యే, ఎంపీలు

నగర సుందరీకరణపై దృష్టి

మహారాణిపేట: నగర సుందరీకరణ, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ ప్రాజెక్టులు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో బుధవారం గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం కలెక్టర్ గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యకలాపాలు, అభివృద్ధి ప్రాజెక్టులపై సమీక్షించారు. ఇటీవల స్మార్ట్ సిటీ కార్పొరేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లలో కొంత మంది మారారని స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కంపెనీ సెక్రటరీ కుసుమాంబ, సీఎఫ్‌వో ఆనంద్ చెప్పగా.. బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఆమోదం తెలిపారు. నూతన పనులను మాత్రం ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియ పూర్తయిన తర్వాతే చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సీ శంఖబ్రత బాగ్చి, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, జీవీఎంసీ ఎస్ఈ. వినయ్ కుమార్, సీటీపీ సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రైలులో వేధింపులు

తాటిచెట్లపాలెం: రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని బుధవారం విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం రాత్రి హౌరా-యశ్వంత్‌పూర్ (12864) రైలులో ఎస్-6 కోచ్‌లో మహిళ హౌరాకు వెళుతోంది. ఇదే కోచ్‌లో ప్రయాణిస్తున్న వెస్ట్ బెంగాల్, మిడ్నాపూర్‌కు చెందిన సంజీవ్ మండల్ అనే వ్యక్తి అర్ధరాత్రి 1 గంట సమయంలో రైలులో ప్రయాణిస్తున్న సదరు మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. వెంటనే మహిళ కేకలు వేయడంతో తోటి ప్రయాణికులు ఈ వ్యక్తిని పట్టుకుని విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి బుధవారం తెల్లవారుజామున అప్పగించారు.


నిందితుడిని అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పటిష్ట ఏర్పాట్లు

మహారాణిపేట: స్థానిక సంస్థల కోటాలో ఈ నెల 30న జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఉమ్మడి జిల్లా రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఏర్పాట్లపై ఉమ్మడి జిల్లా ఏఆర్వోలు, పోలీసు అధికారులతో బుధవారం తన చాంబర్‌లో జేసీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో ఎన్నిక ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితా రూపకల్పన, బ్యాలెట్ పేపరు తయారీ, గుర్తుల కేటాయింపు, తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సాంకేతికపరమైన విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలన్నారు. అనుమతుల జారీకి సంబంధించి సింగిల్ విండో విధానం అమలు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకుని అన్ని కార్యకలాపాలు నిర్వహించాలని చెప్పారు. ఉమ్మడి జిల్లాల నుంచి సమావేశానికి హాజరైన ఏఆర్వోలు, పోలీసు అధికారులు అక్కడి పరిస్థితులను జేసీకి వివరించారు. ఈ సమావేశంలో ఏఆర్వోలు కె.మోహన్‌కుమార్, కె.పద్మావతి, వై.శ్రీనివాసరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బాలకార్మికుల గుర్తింపు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ సునీత

మహారాణిపేట: జిల్లాలో బాల కార్మికులను గుర్తించేందుకు ఈ నెల 9 నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో బుధవారం జరిగిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక శాఖకు అన్ని విభాగాల అధికారులు పూర్తిగా తోడ్పాటు అందించాలని, బాల కార్మికులను గుర్తించే విషయంలో సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ నెల 9 నుంచి 31వ తేదీ వరకు జిల్లా పరిధిలోని అన్ని కంపెనీలు, ప్రయివేటు వ్యాపార సంస్థలు, దుకాణాలు, ఫ్యాక్టరీలు, ఇతర పరిశ్రమలను తనిఖీ చేయాలని, అక్కడ పని చేసేవారి వివరాలను సేకరించాలని చెప్పారు. ఎన్‌సీపీసీఆర్ మార్గ దర్శకాలకు అనుగుణంగా 14 ఏళ్ల లోపు వాళ్లు ఎక్కడా పని చేయడానికి వీలు లేదన్నారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో చాలా కేటరింగ్ సంస్థలు విద్యార్థులను వినియోగించుకునే అవకాశం ఉందని, ఆయా ప్రాంతాలను కూడా తనిఖీ చేయాలన్నారు. ఆనందపురం, పద్మనాభం మండలాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. 2021 ఆగస్టులో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు అయినప్పటి నుంచి ఇప్పటి వరకు తొమ్మిది కేసులు నమోదు చేశామని కార్మిక శాఖ ఉప కమిషనర్ సునీత తెలిపారు. కనీస వేతనం అమలు చేయని యాజమాన్య సంస్థలపై 126 కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో డీఆర్వో కె.మోహన్ కుమార్, ఏసీఎల్ రమాదేవి, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, డీఈవో చంద్రకళ, ఎస్ఎస్ఏ పీవో శ్రీనివాసరావు, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఐసీడీఎస్, పోలీసు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు సినీ నటి హేమ పూజలు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సినీ నటి హేమ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని బుధవారం సినీ నటి హేమ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా హేమ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం తాను సినిమాల్లో నటించడం లేదన్నారు. సెల్ఫ్ హీలైజేషన్ అనే క్లినిక్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ మనిషికి ఓ బాధ ఉంటుందని.. అది ఎవరితోనూ చెప్పుకోలేరన్నారు. ఆ బాధ నుంచి వాళ్లని బయటికి తీసుకొచ్చి.. వాళ్లను ఉత్తమంగా తీర్చిదిద్దడమే ఈ క్లినిక్ ఉద్దేశమన్నారు. ఇటీవల మీడియాలో తనపై వచ్చిన కథనాల నేపథ్యంలో ప్రభుత్వం ఏ పరీక్ష చేసినా.. తాను సిద్ధమేనన్నారు. తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని, వాటిని తొలగించాలని తెలంగాణ ముఖ్యమంత్రిని కోరుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ ప్రవీణ్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద తీరాన్ని ఆనుకుని ఓ వ్యక్తి తన స్థలం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కూడా ఆక్రమించాడు. రుషికొండ సర్వే నంబరు 2/17 సాగరతీరంలో సుమారు 700 గజాల స్థలాన్ని ఆక్రమించినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆర్ఐ ప్రవీణ్ ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు ప్రభుత్వ స్థలం చుట్టూ ఎర్ర జెండాలతో పాటు మధ్యలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. శనివారం స్థల యజమానిని పిలిపించి స్థలం మొత్తం సర్వే చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామని ఆర్ఐ తెలిపారు.

కాసులు కుమ్మరించి..!

7వ పేజీ తరువాయి

అధికారంలోకి వచ్చిన మరుక్షణమే.. టీడీపీ అండ్ కో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీపై కన్నేసింది. తమ పార్టీలోకి చేరితే పర్సంటేజీలు పెంచుతామంటూ కొందరు కార్పొరేటర్లకు ఎరవేసింది. దీంతో వైఎస్సార్‌సీపీ నుంచి 12 మంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేనలోకి వెళ్లిపోయారు. బలం పెరిగినా భయం నీడలోనే ఉన్న టీడీపీ నేతలు డబ్బు రాజకీయాలు మొదలు పెట్టారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ రాగానే చంద్రబాబు ప్రవేశపెట్టిన ఓటుకు నోటు సూత్రాన్ని విశాఖ నేతలు ఫాలో అయ్యారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి గతంలో చేరిన ఓ మహిళా కార్పొరేటర్‌కు ఎమ్మెల్యే వెలగపూడి ఫోన్ చేసి ఓటు వెయ్యాలంటూ బెదిరించారు. అలాగే తమ అభ్యర్థులకు ఓటు వేస్తే రూ.2 నుంచి రూ.5లక్షల వరకూ ఇస్తామని ప్రలోభాలు పెట్టి.. మంగళవారం రాత్రి తమకు మద్దతు ఇస్తామని ప్రకటించిన వారి ఇళ్లకు స్వయంగా ఎమ్మెల్యేల కార్లలోనే పంపిణీలు చేశారు. మద్దతు పలికిన వారిని భీమిలిలోని రిసార్టుకు తరలించి.. అక్కడి నుంచి బస్సు, కార్లలో నేరుగా బుధవారం 12 గంటల సమయంలో పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకొచ్చారు.



రిసార్ట్ నుంచి బస్సులో కార్పొరేటర్లను తీసుకొచ్చిన టీడీపీ నేతలు



వైఎస్సార్ సీపీ నేతలను అడ్డుకున్న పోలీసులు



జీవీఎంసీ ప్రాంగణంలో కె.కె.రాజు

తిష్టవేసిన ఎమ్మెల్యేలు..

ప్రతి ఒక్క కార్పొరేటర్‌ను చివరి క్షణం వరకూ మభ్యపెట్టేందుకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు చేరుకున్నారు. చివరి నిమిషం వరకూ ప్రలోభాలకు లొంగేలా ఒత్తిడి తీసుకొచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 120 మంది పోలీసు బలగాలతో పహారా కాయాలంటూ ఎమ్మెల్యేలు ఆదేశించడంతో జీవీఎంసీ కార్యాలయం పోలీసుల ఆధీనంలోకి వెళ్లిపోయింది.



వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో టీడీపీ కార్పొరేటర్ల వాగ్వాదం

నైతికంగా వైఎస్సార్‌సీపీ గెలిచింది

కుట్రలు, కుతంత్రాలు, డబ్బు రాజకీయాలతో స్టాండింగ్ కమిటీలో కూటమి కార్పొరేటర్లు విజయం సాధించారు. పారదర్శక రాజకీయాలు చేసిన వైఎస్సార్‌సీపీ నైతికంగా విజయం సాధించింది. ఎన్నికల అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఇన్ వ్యాలిడ్ ఓట్లను పరిగణనలోకి తీసుకోకుంటే కనీసం రెండు నుంచి మూడు స్థానాల్లో విజయం సాధించేవాళ్లం. కానీ స్టాండింగ్ కమిటీలో టీడీపీ గెలవలేదు. కుట్రలే గెలిచాయి. దీనిపై న్యాయపోరాటం చేస్తాం.

– గొలగాని హరివెంకటకుమారి, మేయర్

భయపెట్టి ఓట్లేయించుకున్నారు

టీడీపీ నేతలతో కలిసి జీవీఎంసీ కమిషనర్, ఎన్నికల అధికారులు చాలా దారుణంగా వ్యవహరించారు. చెల్లని ఓట్లను ఎలా పరిగణనలోకి తీసుకుంటారు. ఓవైపు న్యాయం కోసం పోరాడుతుంటే.. విజయం సాధించేశారంటూ టీడీపీ వాళ్లకు ధృవపత్రాలు ఎలా ఇచ్చేస్తారు.? ప్రతి దానిపై డిఫరెంట్ కలర్ పెన్సిల్స్‌తో మార్కు చేశారు. పార్టీ మారిన వారందర్నీ ఎమ్మెల్యేలు భయపెట్టారు. గ్రేటర్ చరిత్రలో ఇవి దుర్మార్గమైన ఎన్నికలు.

– అక్కరమాని రోహిణి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్

14 స్కెచ్‌లు లోపలికి ఎలా వెళ్లాయి.?

నా సెంటిమెంట్ పెన్ తీసుకెళ్తుంటే.. పెన్నులేవీ పట్టుకెళ్లకూడదని బయట పెట్టేశారు. కానీ 14 స్కెచ్‌లను లోపలికి ఎలా అనుమతిచ్చారు. పైగా అవి ఇన్వ్యాలిడ్ అని చెప్పినా ఎందుకు పట్టించుకోలేదు. 47 బ్యాలెట్‌లో ఎల్లో కలర్, 85వ బ్యాలెట్‌లో బ్లూ కలర్ ఇలా గుర్తించాం. ఇలాంటి ఎన్నికలు అసలు ఎందుకు పెట్టాలి. మా సైన్ లేకుండా విజేతలను కమిషనర్ అనౌన్స్ చేశారు.

– సాది పద్మావతి, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్

ప్రాధాన్య క్రమంలో రోడ్ల అభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్, అధికారులు

విశాఖ సిటీ: బృహత్తర ప్రణాళికలో ప్రతిపాదించిన రహదారులను ప్రాధాన్యక్రమంలో గుర్తించి.. వాటి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో బుధవారం మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన విజయనగరం, అనకాపల్లి జిల్లాలోని ముఖ్యమైన రహదారుల పరిస్థితిపై ఆయన సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిధుల లభ్యత ప్రకారం ప్రాధాన్యం, ఆవశ్యకతను అనుసరించి రహదారులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ విషయంపై త్వరలోనే ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. ముఖ్యమైన స్టేక్ హోల్డర్లు అయిన ఛాంబర్ ఆఫ్ కామర్స్, సీఐఐ, ఏపీ రెరా, నారెడ్కో, క్రెడాయ్, బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు, మార్పులు, చేర్పులపై అభ్యర్థులను స్వీకరించారు. సమావేశంలో జీవీఎంసీ సీసీపీ సురేష్, వీఎంఆర్డీఏ ముఖ్యప్రణాళికాధికారి సంజయ్‌రత్నకుమార్, వీకేపీసీపీఐఆర్ జాయింట్ డైరెక్టర్ శిల్పా, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, ప్లానింగ్ అధికారులు, ఏపీఐఐసీ, ఆర్ అండ్ బీ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రామాద్రిలో షూటింగ్ సందడి



లొకేషన్‌లో హీరోయిన్ రూప కొడువాయూర్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలో బుధవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాణంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు సంబంధించి హీరోయిన్ రూప కొడువాయూర్, హీరో ప్రియదర్శిపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాలో రచయిత, నటుడు తనికెళ్లభరణి, వెన్నెల కిషోర్ నటిస్తున్నారు. నటీనటులను చూసేందుకు పెద్ద ఎత్తున స్థానికులు తరలివచ్చారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ మోహనరావు

తాటిచెట్లపాలెం : గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు విశాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు (జీఆర్పీ) బి.మోహనరావు తెలిపారు. బుధవారం రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ రాహుల్‌దేవ్ ఆదేశాల ప్రకారం విశాఖ రైల్వే పరిధిలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ, విజయనగరం, పలాస, దువ్వాడ, అనకాపల్లి, సింహాచలం, రైల్వేస్టేషన్‌లలో కూడా నిరంతరం తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 100 రోజుల్లో గంజాయి నియంత్రణపై ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 188 మంది గంజాయి నిందితులను అరెస్టు చేశామని, వీరిలో 11మంది మైనర్లు, మహిళలు కూడా ఉన్నట్లు మోహనరావు వెల్లడించారు. మైనర్లను జువైనల్ హోంకు తరలించినట్లు, 177 మంది నిందితులకు రిమాండ్ విధించినట్లు తెలిపారు. వీరిలో కొందరు పాత నేరస్తులు కూడా ఉన్నారన్నారు. వీరి నుంచి సుమారు రూ.1.25 కోట్లు విలువైన 2,545 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, వీరంతా ఎక్కువగా ఒడిశా నుంచి ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర, తమిళనాడు, బెంగళూరు, కేరళ రాష్ట్రాలకు గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐలు కె.వెంకటరావు (లైన్స్), వి.బాలాజీరావు, శాంతారాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహనరావు

దంతేవాడ వరకు కిరండూల్ రైళ్లు



తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో కురుస్తున్న వర్షాల కారణంగా పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ◆ ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు ఉదయం విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు కిరండూల్‌లో బయల్దేరవలసిన కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ◆ ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు ప్రతి రోజు రాత్రి విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్(18514) ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు కిరండూల్-విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ కూడా దంతేవాడ నుంచి బయల్దేరనుంది. ఆయా తేదీల్లో దంతేవాడ-కిరండూల్ మధ్య రైళ్ల సర్వీసులు రద్దు చేశామని, ప్రయాణికులు మార్పులను గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

సమతా ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే పరిధిలో జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే సమతా ఎక్స్‌ప్రెస్ ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 8న విశాఖపట్నంలో బయలుదేరే విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్(12807) సమతా ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 9న హజరత్ నిజాముద్దీన్‌లో బయలుదేరే హజరత్ నిజాముద్దీన్-విశాఖపట్నం (12808) సమతా ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా విజయవాడ-నాగ్‌పూర్ మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

13న జీరో డిఫెక్ట్-జీరో ఎఫెక్ట్ సర్టిఫికేషన్‌పై వర్క్‌షాప్

విశాఖ సిటీ: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్ సర్టిఫికేషన్‌పై ఈ నెల 13న వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఫ్యాప్సీ కార్యదర్శి పి.వైదేహి ఓ ప్రకటన విడుదల చేశారు. జెడ్ సర్టిఫికేషన్‌పై అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్ 13వ తేదీ మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దసపల్లా హోటల్‌లో జరుగుతుందన్నారు. సాంకేతికతను ఉపయోగించుకుని ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడం, పోటీతత్వాన్ని పెంపొందించి ఎగుమతులను ప్రారంభించడానికి ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందని వివరించారు.

భద్రతా ప్రమాణాలతో పనులు చేపట్టండి

- వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్



అధికారులకు సూచనలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

గోపాలపట్నం: సింహాచలం రైల్వేస్టేషన్‌ను బుధవారం వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇటీవల స్టేషన్‌లో తొలగించిన వంతెన, స్టేషన్ నుంచి చంద్రనగర్‌కు వైపు వెళ్లే ఫుట్ ఓవర్ వంతెన తొలగింపుపై అధికారులతో చర్చించారు. ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా.. పూర్తి భద్రత ప్రమాణాలతో పనులు చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనుల పురోగతిని రైల్వే ఇంజినీరింగ్ అధికారులు డీఆర్ఎంకు వివరించారు.

ఒకే అపార్ట్‌మెంట్.. రెండు ఫ్లాట్లలో..

- చోరీకి యత్నించిన దొంగలు
- దొరకని విలువైన వస్తువులు
- లాకర్లలో భద్రతతో తప్పిన ముప్పు
- వెండి వస్తువుల జోలికెళ్లని చోరులు



డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు

పీఎంపాలెం: పీఎంపాలెం ఆఖరు బస్టాప్ సమీపం బాబా కాలేజీ రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో దొంగలు పడ్డారు. రెండు ఫ్లాట్లలో విలువైన వస్తువులేవీ చోరీకి గురికాలేదు. వెండి వస్తువులున్నప్పటికీ దొంగలు వాటి జోలికి వెళ్లలేదు. పీఎంపాలెం ఎస్ఐ ఆర్. శ్రీనివాస్ తెలిపిన వివరాలివీ..

పీఎంపాలెం ఆఖరు బస్టాప్ నుంచి బాబా కళాశాలకు వెళ్లే రోడ్డులో నాలుగు ఫ్లోర్లతో వైష్ణవి హిల్స్ పేరిట అపార్ట్‌మెంట్ ఉంది. 201 ఫ్లాట్‌లో తాటికొండ ధనలక్ష్మి నివసిస్తున్నారు. ఆమె కుమారులు టి.కృష్ణ ప్రదీప్, పవన్ ప్రదీప్ లండన్‌లో ఉంటున్నారు. ధనలక్ష్మి ఇంటికి తాళాలు వేసి.. రెండు నెలల కిందట కుమారుల వద్దకు వెళ్లింది. ఆ ఫ్లాట్‌లోకి మంగళవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. బలవంతంగా అన్ని గదుల తాళాలు తెరిచారు. అన్ని గదుల్లో వస్తువులు, బీరువాలో సామగ్రిని చిందర వందరగా పడేశారు. బుధవారం ఉదయం ఇంటి బయట తుడిచేందుకు వెళ్లిన వాచ్‌మన్.. తలుపులు తెరచి ఉండటం చూసి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే నేర విభాగం పోలీసులు అపార్ట్‌మెంట్‌కు చేరుకుని ఇంటి యజమాని బంధువుల సమక్షంలో అన్ని గదులను పరిశీలించారు. పోయిన వస్తువుల గురించి తెలుసుకునేందుకు లండన్‌లో ఉన్న ధనలక్ష్మికి ఫోన్ చేశారు. లాకర్‌లో బంగారు ఆభరణాలు భద్రపరిచామని, పూజకు సంబంధించిన వెండి వస్తువులు మాత్రమే ఫ్లాట్‌లో విడిచి పెట్టామని ఆమె తెలిపారు. రెండు తులాల బంగారు ఆభరణాలు పెట్టిన చోట పోలీసులకు చెప్పగా.. పోలీసులు అవి అక్కడే ఉన్నట్లు గుర్తించారు. వెండి వస్తువులను దొంగలు విడిచి పెట్టడం పోలీసులకు ఆశ్చర్యం కలిగించింది. ఫ్లాట్‌లో విలువైన వస్తువులు చోరీకి గురికాలేదని పోలీసులు నిర్ధారించారు.

401 ఫ్లాట్‌లో కూడా చోరీ

అదే అపార్ట్‌మెంట్‌లోని 401 ఫ్లాట్‌లో కూడా దొంగలు చోరీకి యత్నించారు. ఫ్లాట్ యజమాని కె.రవి వేరే ప్రాంతంలో ఇంజినీర్‌గా పని చేస్తుండగా.. అతని భార్య సుశీల ఫ్లాట్‌లో నివాసం ఉంటోంది. అమెరికాలో ఉంటున్న కుమారుడు సూర్య తేజా వద్దకు జూన్ 13న ఆమె వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు ఆ ఫ్లాట్ తాళాలు బద్దలుకొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. అక్కడా విలువైన వస్తువులు దొంగలకు లభించలేదు. ఇంటి యజమాని తమ బంగారు ఆభరణాలను లాకర్‌లో భద్రపరిచినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇక్కడ కూడా వెండి వస్తువులను దొంగలు ముట్టలేదని పోలీసులు తెలిపారు. ఒకే అపార్ట్‌మెంట్‌లోని రెండు ఫ్లాట్లలో దొంగలు చోరీలకు యత్నించడంపై పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో అపార్ట్‌మెంట్‌ను అణువణువూ పరిశీలించారు. అపార్ట్‌మెంట్‌లోని నాలుగు కుటుంబాల్లో రెండు కుటుంబాలు, వాచ్‌మన్ కుటుంబం మాత్రమే ప్రస్తుతం నివసిస్తున్నారు. దీంతో పోలీసులు చోరీకి యత్నించిన ఫ్లాట్లతో పాటు మిగతా వారి ఫ్లాట్లను కూడా పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో అపార్ట్‌మెంట్ మొత్తం, బయట ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెబుతున్నారు. వాచ్‌మన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పప్పుల చిటీల పేరుతో టోకరా

- పోలీసుల అదుపులో నిందితులు!



పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

పెందుర్తి: శ్రావణమాసంలో పప్పుల చిటీల పేరుతో ఓ మహిళ మోసం చేసిందంటూ బాధితులు బుధవారం పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయాలని పోలీసులకు విన్నవించారు. పెందుర్తి ప్రాంతానికి చెందిన మాధవి అనే మహిళ వందలాది మంది వద్ద పప్పుల చిటీల పేరుతో భారీగా నగదు వసూలు చేసిందని బాధితులు ఆరోపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. పోలీసుల అదుపులో నిందితులు ఉన్నట్లు సమాచారం.

సీసీ కెమెరాలు తప్పనిసరి

విశాఖ సిటీ: వ్యాపార సముదాయాలు, దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో సూచించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సేఫ్టీ అమలు చట్టం, 2013 కింద విధిగా ఈ కెమెరాలు పెట్టుకోవాలని తెలిపారు. వ్యాపార సముదాయాలు, దుకాణాల ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లు, పార్కింగ్ ప్రాంతాల వద్ద కెమెరాలతో నిఘా ఉంచాలన్నారు. ప్రజా భద్రతా చర్యలను అందించే బాధ్యత ప్రతి యజమాని, మేనేజర్‌పై ఉంటుందన్నారు. వ్యాపార సముదాయాలను తనిఖీ చేసే అధికారం పోలీస్ ఇన్‌స్పెక్టర్లకు ఉందన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

- మద్యం సేవించడంతో మందలించిన అక్క
- మనస్తాపంతో బలవన్మరణం



అప్పారావు(ఫైల్)

మధురవాడ: మద్యం సేవించి ఇంటికి వచ్చిన యువకుడిని కుటుంబ సభ్యులు మందలించడంతో.. మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలివీ.. పిళ్లా వెంకట అప్పారావు(27) స్వస్థలం యారాడ. అతను చిన్నతనం నుంచి నగరంపాలెంలో నివాసం ఉంటున్న మేనమామ దుక్క గణేష్ వద్దే ఉంటున్నాడు. అమెజాన్‌కు సంబంధించి పార్సిల్ డెలివరీ వాహనం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా.. మంగళవారం రాత్రి అతడు మద్యం సేవించి ఇంటికి రావడంతో అతని అక్క మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అప్పారావు కోపంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. కోపంలో స్నేహితుల వద్దకు వెళ్లి ఉంటాడని, తిరిగి వస్తాడని కుటుంబ సభ్యులు భావించారు. అయితే అతను తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడనే వార్త వారిని కలచివేసింది. ఆర్‌టీసీ కాలనీ నుంచి ఐటీ సెజ్ జంక్షన్ వైపు వెళ్లే రోడ్డులో ఉన్న మల్లయ్యపాలెం శ్మశాన వాటిక వద్ద గల ఓ మామిడి చెట్టుకు టీ షర్టుతో అతను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం 10 గంటలకు చెట్టుకు వేలాడుతున్న అతన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. వారంతా సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పీఎంపాలెం పోలీసులు అక్కడకు చేరుకుని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతను మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సీఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. అప్పారావు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

బాలికతో అసభ్యకర ప్రవర్తన.. వ్యక్తిపై పోక్సో కేసు

సీతమ్మధార: బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై నాలుగో పట్టణ పోలీసులు పోక్సోతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. అక్కయ్యపాలెం అబీద్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక మంగళవారం రాత్రి ఆడుకునేందుకు ఇంటి సమీపంలోని పార్కుకు వెళ్లింది. అక్కడ దొండపర్తికి చెందిన ఎండీ ఇషాక్(50) ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.